క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చంపాపేట: చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని వినయ్‌నగర్, లక్ష్మీనగర్, శ్రీనివాస నగర్, బైరామల్‌గూడ, పోచమ్మగడ్డ, దుర్గా భవానీనగర్ 33/11 కేవీ విద్యుత్ ఫీడర్‌ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కృష్ణానగర్, బాలాజీనగర్, రెడ్డి కాలనీ, చంపాపేట, శ్రీనివాసనగర్, తపోవన్, కర్మన్‌ఘాట్, గ్రీన్‌పార్కు, శ్రీరామ్‌నగర్, పోచమ్మగడ్డ, మారుతీనగర్, యాదగిరినగర్, ఐఎస్‌సదన్, డీఎస్‌నగర్, దుర్గాభవానీనగర్ కాలనీలలో విద్యుత్ ఉండదన్నారు.

సెల్ఫ్‌ఫైనాన్స్ కాలనీ ఫీడర్ పరిధిలో

వనస్థలిపురం: వనస్థలిపురం సబ్‌స్టేషన్ సెల్ఫ్‌ఫైనాన్స్ కాలనీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సెల్ఫ్‌ఫైనాన్స్ కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ రణధీర్ తెలిపారు. అలాగే బీఎన్‌రెడ్డినగర్ ఫీడర్ పరిధిలోని శ్రీరామ్‌నగర్, బీఎన్‌రెడ్డినగర్, ఎస్‌కేడీనగర్‌లలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతు బజారుల్లో కూరగాయల ధరలు టమాట 19, వంకాయ 28, బెండ 50, పచ్చి మిర్చి 47, కాకర 38, బీర 45, క్యాబేజి 10, ఫ్రెంచిబీన్స్ 45, క్యారెట్ 23, దొండ 35–55, చిక్కుడు 65, గోకర 45, బీట్‌రూట్ 17, క్యాప్సికం 60, ఆలు 19–23, దోస 28, సొర 13, పొట్ల 13, ఉల్లి 24. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నేడు రైతుబజార్‌కు సెలవు..

సరూర్‌నగర్ రైతుబజార్‌కు ఈరోజు సెలవుదినమని రైతుబజార్ ఈఓ స్రవంతి ప్రకటించారు. ప్రతి నెల మూడో బుధవారం సెలవు ఇస్తున్నందున నేడు రైతుబజార్‌లో ఎలాంటి క్రయవిక్రయాలు జరగవని ఆమె స్పష్టం చేశారు.

టౌన్‌ప్లానింగ్ అధికారులపై ఏసీబీ నిఘా !

చాదర్‌ఘాట్: మలక్‌పేట సర్కిల్–6 టౌన్ ప్లానింగ్ అధికారులపై ఏసీబీ, విజిలెన్స్ అధికారులు నిఘా పెట్టినట్లు విశ్వసనీయ సమాచారం. మలక్‌పేట నియోజకవర్గంలోని 7 డివిజన్లలో ఇద్దరు టౌన్‌ప్లానింగ్ అధికారులపై పలువురు ఫిర్యాదులు చేసినట్లు తెలుస్తోంది. సదరు అధికారులను పిలిచి ఇటీవలే ఉన్నతాధికారులు హెచ్చరికలు జారీచేశారని పలువురు ఆరోపిస్తున్నారు. ఆరోపణల కారణంగానే ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయం వెళ్లిందని ఇతర టౌన్‌ప్లానింగ్ అధికారులు అనుమానిస్తున్నారు.

కౌన్సెలింగ్‌లోనే పదోన్నతులు కల్పించాలి



హుడాకాంప్లెక్స్: తమ సమస్యలు పరిష్కరించాలని వ్యాయామ విద్య ఉపాధ్యాయ రాష్ట్ర సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం మంత్రి సబితారెడ్డిని కలిసి విన్నవించారు. అప్ గ్రేడేషన్ అయిన 1849 పోస్టులకు కామన్ సీనియారిటీ 11, 12 జీవోల ప్రకారం బీపీఈడీ విద్యార్హతలు ఉన్న అందరినీ కలుపుకుని స్కూల్ అసిస్టెంట్ వ్యాయామ విద్యా ఉపాధ్యాయులుగా జరగబోయే పదోన్నతుల కౌన్సిలింగ్‌లోనే పదోన్నతులు కల్పించాలని అభ్యర్థించినట్లు రాఘవరెడ్డి తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించారని, సమస్య పరిష్కారమయ్యే విధంగా పదోన్నతులలో అవకాశం కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో పేటా టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తిగౌడ్, టీజీ పేటా అధ్యక్షుడు విజయసాగర్, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, పేటా టీఎస్ గౌరవ అధ్యక్షుడు సోమేశ్వరరావు, నల్లగొండ జిల్లా శాఖ అధ్యక్షుడు జై చంద్రయ్య, కోశాధికారి నాగరాజు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే అక్రమ కేసులా?

కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే నాపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్‌కుమార్ అన్నారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కేటీఆర్ ప్రధానమంత్రిని దూషించే భాషపైన ఫిర్యాదు ఇస్తే తెలంగాణ ఫ్రెండ్లీ పోలీస్ కేసు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. కేటీఆర్ భాషతో నేను ప్రశ్నిస్తే మాత్రం నాపైన కేసు ఎందుకు పెడతారని ప్రశ్నించారు. కేటీఆర్ తెలంగాణ ప్రజలని, కేంద్ర ప్రభుత్వం గురించి తప్పుదోవ పట్టిస్తున్నందుకు సమాధానంగా కేటీఆర్ ఉపయోగించే భాషని ఆదర్శంగా తీసుకొని వారిని ప్రశ్నించినందుకు తనపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరూర్‌నగర్, పహాడీషరీఫ్ తదితర పోలీస్‌స్టేషన్‌లో నాపై పదికి పైగా కేసులు నమోదు కావడం దారుణమని అన్నారు. తనపై కేసులు పెట్టించే బదులు డివిజన్ అభివృద్ధిపై దృష్టి పెడితే మంచిదని కోరారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి

సైదాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులంతా సద్వినియోగం చేసుకోవాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని శంకేశ్వరబజార్‌లో నేటి నుంచి ప్రారంభమవుతున్న 'కంటివెలుగు' అవగాహన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. అనంతరం ఎల్‌సీహెచ్ కాలనీలోని మహిళా భవన్ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేయనున్న కంటివెలుగు కేంద్రాన్ని ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కంటి సమస్యలు ఉన్న వారు నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కంటి వెలుగు కేంద్రానికి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఏఈ వెంకన్న, డాక్టర్ తరుణి, శానిటరీ సూపర్‌వైజర్ చందూ, రాజ్‌కుమార్, మురళి, మేరీ, అరుణ, అశోక్‌గౌడ్, చంద్రయ్య, కుర్మేష్, రమేష్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో.. జర దేఖో..



హయత్‌నగర్ పరిధి వీరన్న గుట్ట సమీపంలోని గ్రీన్‌సిటీ కాలనీలో విద్యుత్ స్తంభం ఓ వైపు వంగి ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు కూలుతుందోనని అటుగా రాకపోకలు సాగించేవారు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన స్తంభాన్ని సరిచేయాలని కోరుతున్నారు.

–మన్సూరాబాద్

'పాలకుల అండతోనే ధోబీఘాట్ కబ్జాకు యత్నం'



దీక్షకు మద్దతు తెలుపుతున్న జక్కిడి ప్రభాకర్‌రెడ్డి

మన్సూరాబాద్: పాలకుల అండతోనే ధోబీఘాట్ స్థలాన్ని కబ్జాకు యత్నిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ సర్వే నెంబర్ 207లో ఈదమ్మ రజక సంఘం వద్ద చాకలి ఐలమ్మ చిత్రపటాన్ని దహనం చేసిన దుండగులను శిక్షించాలని రజకులు చేస్తున్న దీక్షకు మంగళవారం జక్కిడి ప్రభాకర్‌రెడ్డి మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హయత్‌నగర్ సర్వే నెంబర్207లో ఈదమ్మ రజక సంఘంకు చెందిన 34గుంటల స్థలాన్ని కబ్జా చేయటానికే భూకబ్జాదారులు ఐలమ్మ చిత్రపటాన్ని దహనం చేశారని మండిపడ్డారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందజేసిన స్పందన లేక రజకులు నిరహారదీక్ష చేపట్టాల్సి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకులు స్పందించి ఐలమ్మ చిత్రపటాన్ని దహనం చేసిన వారిని గుర్తించి శిక్షించాలని, ధోబీఘాట్ స్థలం కబ్జాకు గురికాకుండ ప్రహరీ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌యాదవ్, సుజాతరెడ్డి, సత్యనారాయణ, నర్సింహారెడ్డి, మహేందర్, వెంకటేష్, రమేష్, సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చైనా మాంజాలు స్వాధీనం

హస్తినాపురం: వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో నిషేధిత చైనా మాంజాలను విక్రయిస్తున్న దుకాణాలపై దాడులు చేసి మాంజాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు సీఐ సత్యనారాయణ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చైనా మాంజాలతో ద్విచక్రవాహనాలపై ప్రయాణించే వారి మెడకు చుట్టుకుని మరణించడం, గాయపడిన సంఘటనలు గతంలో చోటు చేసుకున్నాయని ఇలాంటి వాటిని విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.



చైనా మాంజాలను చూపిస్తున్న సత్యనారాయణ

రజకులంతా ఐక్యంగా ఉండాలి



కేలండర్ ఆవిష్కరణ చేస్తున్న బొడ్డుపల్లి కృష్ణ తదితరులు

నాగోలు: రజకులంతా ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని రాష్ట్ర రజక వృత్తిదారుల సమాఖ్య అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. నాగోలు డివిజన్ పరిధిలోని జైపురికాలనీలోని శ్రీ చంద్ర రాజేశ్వర్‌రావ్ భవన్‌లో మాడెశ్వర రజక వృత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ రజక వృత్తిదారుల సమాఖ్య– రాష్ట్ర సమితి రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేతి వృత్తిదారులకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి చేయూత అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, శంకర్, సాయి, పద్మ, భాగ్య, మంజుల, రేణుక, మల్లమ్మ పాల్గొన్నారు.

రాష్ట్రపతిని కలిసిన పెండెం కృష్ణకుమార్

మన్సూరాబాద్: సామాజిక కార్యకర్త, గిన్నిస్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ డా. పెండెం కృష్ణకుమార్ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి తాను చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. 30 ఏళ్లుగా పర్యావరణ పరిరక్షణకు క్లాత్‌బ్యాగ్‌ల వినియోగంపై అవగహన పంపిణీ, విద్య, వైద్యం, నీటి పొదుపు, పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటడం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు జాతీయ నాయకులు, శాస్త్రవేత్తలు, సరస్వతిదేవి చిత్రపటాలు, గోడ గడియారాలు, ఆటవస్తువులు, నోట్‌బుక్స్, బెంచీలను ఉచితంగా పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. మున్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ప్రోత్సహిస్తూ పలు సూచనలు చేశారని కృష్ణకుమార్ తెలిపారు.



రాష్ట్రపతికి చిత్రపటాన్ని బహూకరిస్తున్న కృష్ణకుమార్

బస్టాప్‌లలో ఆటోలు.. ప్రయాణికులకు పాట్లు

హస్తినాపురం: నాగార్జునసాగర్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న బస్టాపుల్లో ఆటోలను నిలుపుతూ ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తున్నాపట్టించుకునే నాథులే కరువయ్యారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగర్‌రింగ్‌రోడ్డు, ఓంకార్‌నగర్, సంతోషిమాతనగర్‌కాలనీ, హస్తినాపురం చౌరస్తా సిగ్నల్, హస్తినాపురం సెంట్రల్‌కాలనీ, బీఎన్‌రెడ్డినగర్ ప్రాంతాలలో ఇష్టానుసారంగా ఆటోలను నిలుపుతున్నారని ట్రాఫిక్ పోలీసులు స్పందించి బస్టాపుల్లో నిలుపుతున్న ఆటోలపై దృష్టి సారించాలని కోరుతున్నారు.



సాగర్‌రోడ్డుపై బస్టాప్‌లో పార్కు చేసిన ఆటోలు

అగ్నిప్రమాదం.. గిఫ్ట్ షాప్ దగ్ధం

హిమాయత్‌నగర్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో దాదాపు రూ.లక్ష ఆస్తినష్టం జరిగినట్టు తెలిసింది. సోమవారం అర్ధరాత్రి నారాయణగూడ పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ప్రమాదం జరిగింది. వివరాలు... దోమలగూడలో నివాసం ఉండే లక్ష్మణ్‌లాల్ గత పదేళ్లుగా హిమాయత్‌నగర్ వైజంక్షన్ సమీపంలోని టీవీఎస్ షోరూం వద్ద ఉన్న ఫుట్‌పాత్‌పై గిఫ్ట్ షాప్ నెలకొల్పి సీజనల్ పండుగలకు సంబంధించిన పలు రకాల వస్తువులను విక్రయిస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి దాటక దట్టమైన పొగలు వ్యాపించి మంటలు మొదలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే లోపల ఉన్న సుమారు రూ.లక్ష విలువ చేసే వస్తువులు కాలి బూడిదైనట్టు ఇన్‌స్పెక్టర్ రాపోలు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని అగ్నిమాపక అధికారులు తెలిపారు.



కాలి బూడిదైన గిఫ్ట్ షాప్



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కుమ్మరులు అన్ని రంగాల్లో రాణించాలి

చంపాపేట: కుమ్మరి కులస్తులు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాలలో రాణించాలని సంఘం అధ్యక్షులు నడికుడి జయంతిరావు అన్నారు. మంగళవారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని ఆనంద్ ఫంక్షన్ హాల్లో ఓంకార్‌నగర్ కుమ్మరి సంఘం శాఖ నూతన సంవత్సర కేలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. దయానంద్, శ్రీనివాస్, శంకర్, వెంకటేష్, రామచంద్రయ్య, సురేందర్, శ్రీనివాస్ సురేష్ పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలి

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్ ఫేస్–2లో డ్రైనేజీ లైన్, వాటర్‌లైన్ సమస్యలను పరిష్కరించాలని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ సీనియర్ నేత ధీరజ్‌రెడ్డి జలమండలి అధికారులకు సూచించారు. మంగళవారం ఎన్టీఆర్‌నగర్ ఫేస్‌లలో ఆయన పర్యటించి కాలనీలోని పలు సమస్యలను పరిశీలించారు. రోజూ డ్రైనేజీ లైన్ లీకేజీతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోయారు.

వాటర్ పైపు లీకేజీ జరగడంతో నీళ్లల్లో డ్రైనేజీ కలవడంతో వారు నిరంతరం వ్యాధుల భారినపడుతున్నారన్నారు. బీజేపీ ఆర్‌కేపురం అధ్యక్షుడు రాములుయాదవ్, నాయకులు సతీష్, నర్సింహ, కృష్ణ, కాలనీవాసులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్‌నగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న బీజేపీ నేత ధీరజ్‌రెడ్డి

మరాఠా ప్రీమియర్‌లీగ్–2

మలక్‌పేట: తెలంగాణ మరాఠా సమాజ్ సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో మరాఠా ప్రీమియర్‌లీగ్–2, క్రికెట్ టోర్నమెంట్ – 2023ను నిర్వహించినట్లు కమిటీ ప్రధాన కార్యదర్శి నితీష్‌రావు జోగ్దే తెలిపారు. మలక్‌పేట్‌లోని సెంట్రల్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో టోర్నమెంట్ వివరాలను వెల్లడించారు. యశ్వంత్‌రావు, బాజీరావు, హరిపంత్, తానాజీ వారియర్స్ టీమ్‌లు టోర్నమెంట్‌లో పాల్గొనగా.. హరిపంత్ విజేతగా నిలిచిందన్నారు. ఈ మేరకు అధ్యక్షుడు సుందర్‌రావు వాఘ్మారే, వైస్ ప్రెసిడెంట్ రాజేష్ వాఘ్మారే విజేతలకు ట్రోఫీ, మెడల్స్ అందజేసి అభినందించారు. జాయింట్ సెక్రటరీ అశోక్‌రావు సదాఫలే, కోశాధికారి లక్ష్మణ్‌రావు కాంబ్లే, సంతోష్ గైక్వాడ్, నికేష్ ధన్వేడే, చంద్రకిరణ్ కమ్లే, శివకిషన్‌గైక్వాడ్ పాల్గొన్నారు.



టోర్నమెంట్‌లో గెలిచిన టీమ్‌తో నిర్వాహకులు

బాలింతల మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

మలక్‌పేట: బాలింతలు సిరివెన్నెల, శివాని మృతిపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేపట్టాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మృతులతో పాటు ఆపరేషన్ అయిన వారికి బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్‌తో నిమ్స్‌కు తరలించారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో పేదప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. పేదల చావుకు కారణమైన వైద్యులపై కేసు నమోదు చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఏరియా ఆసుపత్రిలో మెరుగైన వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎమ్మెల్యే అహ్మద్ బలాల ఆసుపత్రిని పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు బాధిత కుటుంబాలకు ఇంత వరకు ఎలాంటి ఆర్థికసాయం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేంత వరకు బాధితులకు అండగా ఉంటామన్నారు.

ఉప్పల ఫౌండేషన్ చేయూత

నాగోలు: నిరుపేద ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఉప్పల ఫౌండేషన్ అండగా ఉంటుందని చైర్మన్, ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. సిద్దిపేట జిల్లా, మరపడగ గ్రామానికి చెందిన జక్కుల కవిత, మేడ్చల్ జిల్లా, అల్వాల్‌కు చెందిన మౌనిక వివాహం సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని ఉప్పల శ్రీనివాస్ గుప్తా క్యాంప్ కార్యాలయంలో వారికి శ్రీనివాస్ గుప్తా, మంగళ సూత్రం, మెట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టనున్నట్లు తెలిపారు.



మంగళసూత్రం, మెట్టెలు అందజేస్తున్న శ్రీనివాస్ గుప్తా దంపతులు

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు లెక్కచేయకుండా పోరాటాలు చేశాం. నీళ్లు, నిధులు, నియామకాల కోసం గళమెత్తాం. ఇన్ని పోరాటాలు చేసి సాధించుకున్న స్వరాష్ట్రంలో నేడు అనుకున్న మేర ఫలాలు దక్కటం లేదని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యాదిరెడ్డి, వీరేశ్‌కుమార్ విమర్శించారు. ఇబ్రహీంపట్నం డాగ్ బంగ్లాలో మంగళవారం నియోజకవర్గ స్థాయి ఉద్యమకారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ... నాటి ఉద్యమంలో పాల్గొని అన్ని రకాలుగా నష్టపోయాం. అయితే నాడు తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించిన వాళ్లే నేడు అధికారం చెలాయిస్తున్నారు. నిజమైన తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఉద్యమకారుల సంక్షేమం కోసం కృషి చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, సంక్షేమ పథకాల్లో 20 శాతం అవకాశాలు కల్పించాలి, ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని కోరారు. రైతుబంధు పథకాన్ని 5 ఎకరాల్లోపు ఉన్న రైతులకే వర్తింపజేసి, మిగితా డబ్బులను ఉద్యమకారుల సంక్షేమ కోసం ఖర్చుచేయాలని డిమాండ్ చేశారు. దళితబంధు పథకంలో ప్రాధాన్యత కల్పించాలని.. నిరుపేద కుటుంబాలను చెందిన వారికి గ్రామాల్లో ఎకరా వ్యవసాయ భూమిని పంపిణీ చేయాలన్నారు. రూ.5 వేల పింఛన్‌ను అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కన్వీనర్ వెంకటేశంగౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్, నాయకులు కారింగ్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కనిపించడం లేదా ?

మీర్‌పేట: మంత్రి సబితారెడ్డి కోట్ల రూపాయలు వెచ్చించి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తుంటే ఆ పనులు ప్రతిపక్ష పార్టీలకు కనిపించడం లేదా అని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించారు. మంగళవారం మీర్‌పేటలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు మాట్లాడారు. మంత్రి సబితారెడ్డి చెరువుల సుందరీకరణ, ప్రధాన రహదారుల విస్తరణ, మిషన్ భగీరథ ట్యాంకులు, నూతన పైపులైన్ నిర్మాణాలకు నిధులు మంజూరు చేసి పనులు చేపట్టారని తెలిపారు. అలాగే నూతనంగా ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో ఇంత అభివృద్ధి జరుగుతున్నా ప్రతిపక్షాలకు కనిపించడం లేదని, సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్రం నుంచి ఎన్ని నిధులు తెచ్చారో బీజేపీ నాయకులు శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు హన్మగళ్ల చంద్రయ్య, లక్ష్మీనరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శులు బేర బాలకిషన్, అరవింద్ శర్మ, మీర్‌పేట మేయర్ ఎం దుర్గ, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, మీర్‌పేట కార్పొరేషన్ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి, మహేశ్వరం మండల అధ్యక్షుడు అంగోత్ రాజునాయక్, తుక్కుగూడ మున్సిపాలిటీ అధ్యక్షుడు లక్ష్మయ్య, మహేశ్వరం మార్కెట్ కమిటీ సురసాని సురేందర్ రెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు